Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
19-07-2025
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 226 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD శనివారం WWW.EPAPER.MAHAADAILY.COM



## ధూంధాంగా బోనాల ఉత్సవాలు

### అమ్మవారికి పూజలు నిర్వహించిన స్పెషల్ కమిషనర్ ప్రియాంక


**హైదరాబాద్, మహా :** సమాచార పౌర సంబంధాల శాఖ సమాచార భవన్, మాసబ్ ట్యాంక్ లో బోనాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సమాచార శాఖ ఉద్యోగుల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సవ ఊరేగింపులు, బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సమాచార భవన్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో బోనాల సంబరాలు జరిగాయి.

మిగతా 2లో

టాప్ న్యూస్

## ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు


- అభివృద్ధి పనుల కోసం గ్రాంట్లు విడుదల
- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక నిర్ణయం



02

## కేటీఆర్‌కు అన్నీ స్ట్రోక్‌లే

- కాళేశ్వరం విషయంలో బావబామ్మర్దుల ఓవరాక్షన్
- సాటు సంసారం చేసే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీది
- హరీశ్ రావు, కేటీఆర్, బండి సంజయ్ అచానక్ లీడర్లు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్



03

## ఫిష్ వెంకట్ కన్నుమూత

- ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఆయన మృతి పట్ల సినీ ప్రముఖుల సంతాపం



02



# 2034 దాకా నేనే సీఎం

## కేసీఆర్ నీ గుండెమీద రాసుకో

పాలమూరు ప్రజలు కేసీఆర్ కు అన్నంపెడితే.. ఆయన సున్నం పెట్టారు

కరీంనగర్ నుండి పారిపోయి వచ్చిన నిన్ను గెలిపిస్తే పాలమూరుకు ఏం చేశావ్?

పాలమూరు రంగారెడ్డితో సహా ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తా

చంద్రబాబు గారూ రాయలసీమ లిఫ్ట్ రద్దుచేసుకోండి.. సహకారం లేకుంటే సమరం తప్పదు

నాగర్ కర్నూల్ జిల్లా జటప్రోలు సభలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

02

'నీ గుండె, నీ కుమారుడి గుండె మీద కూడా రాసుకో.. మరో పదేళ్లు నేనే సీఎంగా ఉంటా. 2034 దాకా నేనే సీఎం. ఈ పాలమూరు బిడ్డే ముఖ్యమంత్రిగా ఉంటడు. తెలంగాణను ప్రజా ప్రభుత్వంతో నడిపిస్తడు ' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించాడు. కేసీఆర్ ను ప్రతీసారీ అసెంబ్లీకి రావాలని కోరుతున్న. ఎందుకంటే ఆయన రాంగనే ఏదో అయితదని కాదు. ఆయనను ప్రతిపక్షంలో చూడాలి. ఆయన చేసిన ద్రోహం ఆయనకు తెల్వాలె. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి నేర్చుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. 'నీకు దుఃఖమొస్తే ఏడ్చినా, బావిలో దూకినా, నీ ఇష్టం' కానీ తెలంగాణ ప్రజల కోసం తాము చేసే మంచి పనులను చూస్తూ ఉండాలని రేవంత్ రెడ్డి తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతోపాటు దిండి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు.

- మహా, నాగర్ కర్నూల్

## లోకేష్‌ను కలిస్తే తప్పేంటి?

### ఏదో దావూద్ ఇబ్రహీం, గుండాను కలిశానని ప్రచారం చేస్తున్నావ్?

- దుబాయ్‌లో ఎవరో చనిపోతే నాకేం సంబంధం?
- బాజాప్త చేస్తా.. నేను జీవితంలో ఏనాడూ సిగరెట్ కూడా తాగలేదు
- ముగ్గురు మంత్రుల ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి ట్యాప్ చేస్తుండు
- ఆధారాలతో సహా అన్నీ బయటపెడతా.. దమ్ముంటే సమాధానం చెప్పు
- 420 హామీల విషయంలో కాంగ్రెస్‌తో ఫుట్‌బాల్ ఆడుకుంటాం
- మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**ఖమ్మం, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపించారు. తన ముఖ్యమంత్రి సీటుకు ఎసరు పెడుతున్నారనే భయంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిల ఫోన్లు ట్యాప్ చేయించడం లేదా? అని ప్రశ్నించారు.

మిగతా 2లో

## దంచుడే.. దంచుడు

### హైదరాబాద్‌లో కుండ పోత వర్షం.. రోడ్లన్నీ జలమయం.. భారీగా ట్రాఫిక్ జాం

02

మారేడ్‌పల్లిలో 11.28 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

మరో నాలుగు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వానలు

ప్రజలు పీకేసినోళ్ళు పీకుతామంటే..

## అపహాస్యంగా ఉంది

ఇంట్లో సరిచేసుకోలేని సన్నాసులు దేశరాజకీయాలు చేస్తారట

కేటీఆర్ పై మంత్రి తుమ్మల సంచలన వ్యాఖ్యలు

02




# 2034 దాకా నేనే సీఎం

## కేసీఆర్ నీ గుండెమీద రాసుకో

- పాలమూరు ప్రజలు కేసీఆర్ కు అన్నంపెడితే.. ఆయన సున్నం పెట్టారు
- కరీంనగర్ నుండి పారిపోయి వచ్చిన నిన్ను గెలిపిస్తే పాలమూరుకు ఏం చేశావ్?
- పాలమూరు రంగారెడ్డితో సహా ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తా
- చంద్రబాబు గారూ రాయలసీమ లిఫ్ట్ రద్దుచేసుకోండి.. సహకారం లేకుంటే సమరం తప్పదు
- నాగర్ కర్నూల్ జిల్లా జటప్రోలు సభలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు




సీఎంతో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

**నాగర్ కర్నూల్ , మహా :** 'నీ గుండె, నీ కుమారుడి గుండె మీద కూడా రాసుకో.. మరో పదేళ్లు నేనే సీఎంగా ఉంటా. 2034 దాకా నేనే సీఎం. ఈ పాలమూరు బిడ్డే ముఖ్యమంత్రిగా ఉంటడు. తెలంగాణను ప్రజా ప్రభుత్వంతో నడిపిస్తడు ' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించాడు. కేసీఆర్ ను ప్రతీసారీ అసెంబ్లీకి రావాలని కోరుతున్న. ఎందుకంటే ఆయన రాంగనే ఏదో అయితదని కాదు. ఆయనను ప్రతిపక్షంలో చూడాలి. ఆయన చేసిన ద్రోహం ఆయనకు తెల్వాలె. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి నేర్చుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. 'నీకు దుఃఖమొస్తే ఏడ్చినా, బావిలో దూకినా, నీ ఇష్టం' కానీ తెలంగాణ ప్రజల కోసం తాము చేసే మంచి పనులను చూస్తూ ఉండాలని రేవంత్ రెడ్డి తెలిపారు. పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతోపాటు దిండి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రద్దు చేసుకోవాలని, అందుకు సహకరించాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. సహకారం లేకపోతే పోరాటం తప్పదని అన్నారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం తన బాధ్యత అంటూ స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి క్రిష్ణారావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

**పాలమూరు బిడ్డ 20 ఏళ్లు సీఎంగా**

కరీంనగర్ జిల్లా నుంచి పారిపోయి పాలమూరు గడ్డకు వస్తే అందరం కలిసి కేసీఆర్‌కు అండగా నిలబడ్డామని, కానీ పదేళ్ల పాలనలో ఈ ప్రాంతానికి సున్నం పెట్టింది మీరు కాదా? అని ఇప్పుడు దుఃఖం వస్తోందని కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. మాదిగల పిల్లలకు వైద్య విద్య సీట్లు వస్తుంటే దుఃఖం వస్తోందా? అని ప్రశ్నించారు. పాలమూరు బిడ్డ 20 ఏళ్లు సీఎంగా ఉండాలని మహబూబ్‌నగర్ జిల్లా కంకణం కట్టుకున్నందుకు దుఃఖమొచ్చిందా? అని అడిగారు. ఈ పాలమూరు బిడ్డే 2034 దాకా తెలంగాణను ప్రజా ప్రభుత్వంతో నడిపిస్తాడని సీఎం రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి నేర్చుకోవాలని హితబోధ చేశారు . 'నీకు దుఃఖమొస్తే ఏడ్చినా, బావిలో దూకినా, నీ ఇష్టం' కానీ తెలంగాణ ప్రజల కోసం తాము చేసే మంచి పనులను చూస్తూ ఉండాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు ప్రాంతం సస్యశ్యామలంగా మారి, రైతుల జీవనోపాధికి బలమైన ఆధారంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**రూ.200 కోట్ల వ్యయంతో...**

నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పాలమూరు ప్రాంత అభివృద్ధికి కొత్త ఆశలు లభించాయి. ఈ సందర్భంగా రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ స్కూల్ విద్యార్థులకు ఆధునిక విద్య, సౌకర్యాలతో ఉజ్వల భవిష్యత్తును అందించనుంది. ఈ సందర్భంగా కొల్లాపూర్ అభివృద్ధికి అవసరమైన నిధులను పూర్తిగా అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గతంలో కేసీఆర్ నాయకత్వంలో పాలమూరు పట్ల నిర్లక్ష్యం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్.. పాలమూరు ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. వరద బాధితులకు ఇళ్లు కట్టిస్తానని చెప్పిన కేసీఆర్.. ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదన్నారు. రూ.25వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇప్పటికే పూర్తయ్యేదన్నారు రేవంత్. అదే సమయంలో రూ .లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడేళ్లలో కూలేశ్వరంగా మారిందని ఎద్దేవా చేశారు.

**ప్రాజెక్టులకు కొత్త ఊపు**

ఈ సందర్భంగా సీఎం రేవంత్, పాలమూరు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్‌లోగా భూసేకరణ పూర్తి చేసి, కృష్ణా జలాలను పొలాలకు తీసుకొస్తామని అన్నారు. 'మా పొలాల్లో కృష్ణా నీళ్లు పారుతుంటే, కొందరు దీనిని ఓర్చుకోలేకపోతున్నారు. కేసీఆర్ లాంటి వాళ్లు విషం చిమ్ముతున్నారని' రేవంత్ వ్యాఖ్యానించారు. పాలమూరు పచ్చగా మారితే, రైతులు సంతోషంగా ఉంటారని, అది కొందరికి కడుపుమంటగా ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినట్లు సీఎం రేవంత్ తెలిపారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేశామని, వరి పండించిన రైతులకు బోనస్ కూడా ఇస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని కొందరు అన్నారని, కానీ తాము 24 గంటలూ ఉచిత కరెంటు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**మహిళల సాధికారతకు పెద్దపీట**

మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, వెయ్యి బస్సులకు మహిళలను యజమానులుగా చేశామని అన్నారు. రూ.21వేల కోట్ల వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంక్‌లకు యజమానులుగా, సోలార్ విద్యుత్ కాంట్రాక్టులు ఇచ్చి మహిళలను సాధికారత వైపు నడిపిస్తున్నామని వివరించారు. కేసీఆర్ తన బిడ్డకు బంజారాహిల్స్‌లో బంగ్లా కట్టించారు. కానీ తాము తెలంగాణ ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ హామీలు నెరవేరలేదని రేవంత్ విమర్శించారు. వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేసీఆర్ చెప్పి, ఎందుకు చేయలేదన్నారు. దళిత బిడ్డలు చదువుకుంటే, రాజ్యాలు ఏలితే కొందరికి దుఃఖం వస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ కులాల వర్గీకరణ చేసి న్యాయం చేసిందని రేవంత్ తెలిపారు.

### పాలమూరును పచ్చగా మారుస్తాం

**2035 నాటికి తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. పాలమూరు పచ్చగా మారాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ లక్ష్యం కోసం కృషి చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు సాధికారత, ప్రాజెక్టుల పూర్తితో పాలమూరు కొత్త ఒరవడిని సాధిస్తుందని రేవంత్ హామీ ఇచ్చారు. సభలో మంత్రులు జూపల్లి క్రిష్ణారావు, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేష్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.**

# లోకేష్‌ను కలిస్తే తప్పేంటి?

(మొదటిపేజీ తరువాయి)

దమ్ముంటే రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఆధారాలతో సహా అన్నీ బయటపెడతా అని అన్నారు. ప్రస్తుతం కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. శుక్రవారం ఖమ్మం జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. అక్కడ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ కుమార్, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**లోకేష్ మీ పెద్ద బాస్ కొడుకే కదా..?**

తాను నారా లోకేష్‌ను కలవలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. లోకేష్‌ను చీకట్లో కలవాల్సిన అవసరం తనకు లేదన్నారు. రేవంత్ రెడ్డి గాలి గన్నయ్య మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. తాను ఏది చేసినా బాజాప్తానే చేస్తానంటూ బదులిచ్చారు. లోకేష్ ఒక తమ్ముడు లాంటివాడని... ఒకవేళ కలిస్తే తప్పేంటని ప్రశ్నించారు. లోకేష్ ఏమైనా రేవంత్ రెడ్డి సంచులు మోసిన దొంగ కాదుగా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. “లోకేష్ మీ పెద్ద బాస్ కొడుకే కదా..? ఏదో దావూద్ ఇబ్రహీం, గుండాను చీకట్లో కలిశాను అని ప్రచారం చేస్తున్నావ్...? పాలన గురించి తెలుసుకోవాలనుకుంటే బీఆర్ఎస్ వాళ్ళనే కలుస్తారు. దోపిడి గురించి తెలుసుకోవాలనుకుంటే రేవంత్ రెడ్డిని కలుస్తారు" అంటూ కేటీఆర్ సీరియస్ అయ్యారు. ‘వెన్నుపోటు పోవడం అనేది రేవంత్ రెడ్డి కొత్తేం కాదు.. వెన్నతో పెట్టిన విద్య.. నమ్మి ఓటేసిన పాపానికి దేశ రాజధాని ఢిల్లీ సాక్షిగా రాష్ట్ర ప్రజల గొంతు కోసిన కసాయి రేవంత్ రెడ్డి. నాడు నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిండు. ఈ రోజు ప్రజల నోట్లో మట్టి కొడుతుండు. త్యాగాలు, పోరాటాలు, బలిదానాలతో ఏర్పడ్డ ఈ తెలంగాణకు ఇలాంటి నికృష్టుడు మనకు సీఎంగా ఉండడం మనందరికీ అవమానం. కేసీఆర్ ప్రభుత్వంలో పదేండ్లు రైతు పొలంలో నీళ్లు ఉండాలి కానీ రైతు కళల్లో నీళ్లు ఉండకూదని నీళ్లు ఇచ్చాం. అనుక్షణం తపించి.. కేసీఆర్ ప్రాజెక్టులు కట్టారు. రైతుబంధు, రైతుబీమా పెట్టి తెలంగాణ రైతులను నంబర్ వన్ స్థానానికి తీసుకెళ్లిండు. దాని గురించి కూడా రేవంత్ చిల్లర మాటలు మాట్లాడిండు. బనకచర్ల విషయంలో అడ్డంగా దొరికిపోయిండు కాబట్టి.. కుర్తిలో పడ్డ ఎలుకలా కొట్టుకుంటున్నడు రేవంత్ రెడ్డి’ అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**బీఆర్ఎస్‌కు వంద సీట్లు ఖాయం..**

చీకట్లో కూర్చొని చిట్‌చాట్‌లు అంటూ నా మీద ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్ చెప్పారు. దమ్మంటే ఆధారాలు బయటపెట్టాలని సవాల్ విసిరారు. ఒకసారి ఫోన్ ట్యాపింగ్, ఫార్ములాఈ, డ్రగ్స్ కేసు.. మరోసారి కాళేశ్వరం లేదా కేసీఆర్.. ఇలా డైవర్షన్ పాలిటిక్స్ చేయడం తప్ప ఇరవై నెలల్లో ఈ నికృష్ట ముఖ్యమంత్రి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ‘అక్రమ కేసులు పెట్టినా, అడ్డగోలుగా మాట్లాడినా, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా రేవంత్ రెడ్డిని వదిలిపెట్టేది లేదు. 42 శాతం రిజర్వేషన్లు, సబ్‌ప్లాన్ పేరుతో బీసీలను దారుణంగా మోసం చేశారు. ఎరువులు, విత్తనాల కొరతతో రైతులు ఆగం అవుతుంటే ప్రభుత్వం మొద్దునిద్రపోతుంది. ఇప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌కు వంద సీట్లు ఖాయం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఖతమవుతది. ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి దర్జాగా తిరుగుతున్నారు. ఒకరు బాంబులేటిగా మారితే ఇంకొకరు కమీషన్ దందాల్లో మునిగిపోయారు’ అని కేటీఆర్ ఆరోపించారు.



# ధూంధాంగా బోనాల ఉత్సవాలు

## అమ్మవారికి పూజలు నిర్వహించిన స్పెషల్ కమిషనర్ ప్రియాంక



(మొదటిపేజీ తరువాయి)

సమాచార శాఖ ప్రత్యేక కమీషనర్ సి.హెచ్. ప్రియాంక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపులో డప్పు విన్యాసాలు, పోతరాజుల ప్రదర్శనలతో పలు కళారూపాలకు చెందిన కళాకారులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలలో సమాచార శాఖ సంచాలకులు ఎల్.ఎల్.ఆర్. కిషోర్ బాబు, అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్, జాయింట్ డైరెక్టర్లు డి.శ్రీనివాస్, కె.వెంకటరమణ, సమాచార శాఖ మాజీ డైరెక్టర్ సుభాష్ గౌడ్, సీఐఈ రాధాకిషన్, డిప్యూటి డైరెక్టర్లు యం.మధుసూధన్, సి.రాజారెడ్డి, జి.ప్రసాద్ రావు, కె.వి.సురేష్, ఆర్ఐఈ జయ రామ్మూర్తి, సహాయ సంచాలకులు ప్రణీత్ కుమార్, సత్యనారాయణ రెడ్డి, బిమల్ దేవ్, డిప్యూటీ ఐఈ నర్సింహా గౌడ్, అకౌంట్స్ ఆఫీసర్లు పద్మ, హేమ, టీఎన్ జీవోస్ నాయకులు అనిల్, జితేందర్ , దుర్గప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

# హైడ్రాకు ఏడాది

## 500 ఎకరాల ప్రభుత్వ స్థలాలను రక్షించాం

- రూ.30 వేల కోట్ల విలువైన స్థలాలను పరిరక్షించాం
- పేదలు కాదు.. పెద్దలు కూడా హైడ్రా టార్గెట్
- ప్రజల సహకారంతో ప్రభుత్వ ఆస్తులు కాపాడే ప్రయత్నం
- కూల్చడమే కాదు నిర్మాణం చేయాలనేది సీఎం రేవంత్ ఆకాంక్ష
- హైడ్రా ప్రథమ వార్షికోత్సవం కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** హైడ్రా పరిరక్షించిన స్థలాల విలువ దాదాపు రూ.30 వేల కోట్లపైనే ఉంటుందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. తమ ఆస్తులు ఆక్రమణదారులకు చిక్కకుండా ప్రజలే పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. హైడ్రా తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట వద్ద విద్యార్థులు, స్థానికులతో కలిసి పెద్దఎత్తున మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏడాదిలో హైడ్రాకు ఎన్నో మంచి, చెడు అనుభవాలు ఎదురయ్యాయని తెలిపారు. విపత్తుల నిర్వహణకు సంబంధించి పక్కా ప్రణాళికతో హైడ్రా పనిచేస్తుందని వివరించారు. ఏడాదిలో 500 ఎకరాల ప్రభుత్వ స్థలాలను పరిరక్షించామని, హైడ్రా పరిరక్షించిన స్థలాల విలువ దాదాపు రూ.30 వేల కోట్లపైనే ఉంటుందని వెల్లడించారు. ఆరు చెరువులను పునరుద్ధరిస్తున్నామని, వాటి విస్తీర్ణం రెట్టింపు స్థాయిలో పెరిగిందన్నారు. ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలు, నాలాలను పరిరక్షిస్తున్నామని, న్యాయపరమైన సవాళ్లను కూడా అధిగమిస్తూ భూములను కాపాడుతున్నామన్నారు.

**ఆ కళాశాలపై ఎందుకు అంత ఆసక్తి?..**


ప్రభుత్వం హైడ్రాకు ఒక నిర్దిష్టమైన విధానాన్ని సూచించిందని హైడ్రా చీఫ్ తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే హైడ్రా పనిచేస్తుందన్నారు. ఆక్రమణల వెనుక చాలా మంది పెద్దవాళ్లు ఉంటారని, వాళ్లు తప్పించుకోవడానికి పేదలను బుల్డోజర్ల ముందు పెడుతున్నారన్నారు. ‘పేదవాళ్ల మీద హైడ్రా పగబట్టిందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయిస్తున్నారు. రూ.3040 కోట్ల పార్క్ స్థలాన్ని ఆక్రమించే ధైర్యం పేదవాళ్లకు ఉంటుందా. హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూసీకి సంబంధం లేకున్నా హైడ్రాకు ముడిపెట్టారు. ఒవైసీ కళాశాల విషయంలో మా నిర్ణయాన్ని స్పష్టంగా చెప్పాం. హైడ్రా ఒక సామాజిక కోణంలో పనిచేస్తుంది. ఒవైసీ కళాశాల 201516లో నిర్మించారు. కళాశాల ఉన్న చెరువు ప్రాంతానికి 2016లో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారు. సల్కం చెరువుకు తుది నోటిఫికేషన్ ఇంకా ఇవ్వలేదు. నగరంలోని 80 శాతం చెరువులకు తుది నోటిఫికేషన్ ఇంకా జారీ చేయలేదు. 140 చెరువులకు మాత్రమే తుది నోటిఫికేషన్ ఇచ్చారు. 540 చెరువులకు పదేళ్ల కిందట ప్రాథమిక నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చారు. సల్కం చెరువు నోటిఫికేషన్ ప్రాసెస్‌లో ఉండగా ఎవరికి వారు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అనధికారిక నిర్మాణాలను తప్పకుండా తొలగిస్తాం. ఒవైసీ కళాశాలపైనే పదే పదే ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఆ కళాశాలపై ఎందుకు అంత ఆసక్తి? ఏ వర్గం కళాశాల అయినా ఒకటే రూల్ వర్తిస్తుంది. సామాజిక కోణంలో కూడా ఆలోచించాలి’ అని కమిషనర్ రంగనాథ్ అన్నారు.

# దంచుడే.. దంచుడు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో వర్షం దంచికొట్టింది. ఆకాశానికి చిల్లు పడింది అన్నట్లుగా శుక్రవారం కుండపోతగా వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ చెరువుల మాదిరిగా కనిపించాయి. లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. ఇళ్లల్లోకి నీళ్లు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్నిచోట్ల నీరు నిలిచిపోవడంతో పలు ప్రాంతాల్లోని రహదారులు చెరువులను తలపించాయి.

**అత్యధికంగా..**

అత్యధికంగా మారేడ్‌పల్లి పికెట్ ప్రాంతంలో 11.28 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మారేడ్‌పల్లి, బాలానగర్, బండ్లగూడ, ముషీరాబాద్‌లో 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బోయిన్‌పల్లిలో 11.10 సెం.మీ నాచారంలో 10.05 సెం.మీ, ఉప్పల్, మల్కాజ్‌గిరిలో 10 సెం.మీ, ముసారాంబాగ్‌లో 9.8 సెం.మీ, మల్కాజ్‌గిరి అడ్డగుంటలో 9.7 సెం.మీ, బండ్లగూడలో 9.53 సెం.మీ, ఓయూలో 8.95 సెం.మీ, అంబర్‌పేట, కుత్బుల్లాపూర్‌లో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బార్కాస్, కందికల్‌గేట్‌లో 8.55, అంబర్‌పేటలో 8.45, కుత్బుల్లాపూర్‌లో 8.25, ఫూల్‌బాగ్‌లో 8.15, జవహర్‌నగర్‌లో 8, బతుకమ్మకుంటలో 7.93, ఆనంద్‌బాగ్, విద్యానగర్, భోలక్‌పూర్‌లో 7.8, మెట్టుగూడలో 7.78, మాదాపూర్‌లో 7.58, కూకట్‌పల్లిలో 7.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది.


సాగర్ నిండుకుండలా..

బంజారా హిల్స్, పికెట్, కూకట్ పల్లి నాళాల నుంచి హుస్సేన్ సాగర్ లోకి వస్తున్న వరద కారణంగా సాగర్ నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్ లో నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్‌కు చేరుకుంది. హుస్సేన్ సాగర్ ప్రస్తుత నీటిమట్టం 513.38 మీటర్లకు చేరుకుంది. దీంతో నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 513.41 మీటర్లే. శుక్రవారం కురిసిన వర్షానికి దాదాపు నిండిపోయింది. ఫుల్ కెపాసిటీకి రావడానికి కేవలం 0.3 మీటర్లే ఉంది. దీంతో మరికొద్ది సేపట్లో పూర్తిగా నిండిపోతుందని అధికారులు చెబుతున్నారు. భారీగా వరద నీరు చేరటంతో నిండుకుండలా ప్రమాదకరంగా సాగర్ మారిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు నీళ్లను తూముల ద్వారా మూసీ నదిలోకి వదులుతున్నారు అధికారులు.

**మరో నాలుగు రోజుల పాటు..**

మరో నాలుగు రోజుల పాటు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, అసవరమైతేనే బయటకు వెళ్లాలని సూచించింది. ఇక దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని జిల్లాల్లో 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.నేడు సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో, ఈ నెల 20న రంగారెడ్డి, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో, 21న ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో, 22న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# ప్రజలు పీకేసినోళ్ళు పీకుతామంటే.. అపహాస్యంగా ఉంది

- ఇంట్లో సరిచేసుకోలేని సన్నాసులు దేశరాజకీయాలు చేస్తారట
- కేటీఆర్ పై మంత్రి తుమ్మల సంచలన వ్యాఖ్యలు

**ఖమ్మం, మహా:** ప్రజలు పీకేసినోళ్ళు పీకుతామంటే అపహాస్యంగా ఉందని, మీ అహంకారంవల్లే ప్రజలు గుణపాఠం చెప్పారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలపై గట్టి కౌంటరిచ్చారు. మాట్లాడేముందు మీ నాన్నని అడిగి అభివృద్ధి పై మాట్లాడాలన్నారు. సీతారామ ప్రాజెక్ట్ రోళ్లపాడు లో కేసీఆర్ శంకుస్థాపన చేస్తే ఎందుకు రీ డిజైన్ లో మార్చారని, ఇంట్లో సరిచేసుకోలేని సన్నాసులు దేశ రాజకీయాలు చేస్తారట అంటూ ఫైరయ్యారు. అసెంబ్లీ లో బుద్ధి చెప్పినా పార్లమెంట్ లో బుద్ధి చెప్పినా సిగ్గు రాలేదని, బనకచర్ల మీద కాళేశ్వరం పైన బొక్కినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. పెద్దాయన ను ఇబ్బంది పెట్టేలా కేటీఆర్ రాజకీయం సాగుతోందని, పిచ్చి మాటలు రోత మాటలు మాట్లాడి రాజకీయాలు దిగ జార్చొద్దన్నారు. విందుల్లో విలాసాల్లో మునిగి గోదావరి కృష్ణా నదుల వాటాలు దారాదత్తం చేసారని, ఏ మొహం పెట్టుకుని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారన్నారు. మీ పాలనలో జరిగిన విధ్వంసం సరి చేసేందుకు ఇంత కాలం పట్టిందని, రైతు శవాల పై పేలాలు ఏరుకుని అధికారం లోకి రావాలని మీ కలలు కలగానే మిగులుతాయన్నారు. ముఖ్యమంత్రి పై మాట్లాడే ముందు ఇంగిత జ్ఞానం తో మాట్లాడాలన్నారు.

# ఫిష్ వెంకట్ కన్నుమూత

## ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

### ఆయన మృతి పట్ల సినీ ప్రముఖుల సంతాపం

**హైదరాబాద్, మహా:** తెలుగు సినీ ఇండస్ట్రీలో ఎన్నో సినిమాలలో విలన్ పాత్రలలోను, కమెడియన్ గా నటించి ప్రేక్షకులను మెప్పించిన ఫిష్ వెంకట్ ఇక లేరు. శుక్రవారం రాత్రి చందానగర్ లోని పీకేఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఫిష్ వెంకట్ మరణవార్త తెలిసిన పలువురు సినీ సెలబ్రిటీలు ఆయన మృతి పట్ల సంతాపం తెలియజేస్తున్నారు. తెలుగులో 100కు పైగా చిత్రాల్లో హాస్య నటుడుగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మెప్పించారు. సినిమాల్లో విలన్ అంటే కొందరు గుర్తొస్తారు.. అలాంటి వారిలో ఫిష్ వెంకట్ ఒకరు. మెయిన్ విలన్ పక్కన ఉండే పాత్రలో బోలెడన్ని మూవీస్ చేశారు. ఎన్టీఆర్ 'ఆది' మూవీలో తొడకొట్టు చిన్నా అనే డైలాగ్‌తో తెగ పాపులర్ అయ్యారు.

**క్షీణించిన ఆరోగ్యం..**

ఆయన రెండు కిడ్నీలు పాడవ్వడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఈ క్రమంలో కిడ్నీ మార్పిడికి సుమారుగా 50 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో సినీ ఇండస్ట్రీ పెద్దల్ని, ప్రభుత్వం ఆదుకోవాలని ఫిష్ వెంకట్ కుటుంబ సభ్యులు కోరారు. ఈ క్రమంలో ఫిష్ వెంకట్ హెల్త్ గురించి మాత్రం పలువురు హీరోలు సాయం అందించారు. అయిన కూడా ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించడంతో ఫిష్ వెంకట్ తుదిశ్వాస విడిచారు. ఫిష్ వెంకట్ అకాల మరణం టాలీవుడ్ కు తీరని లోటు అంటూ ఆయన సన్నిహితులు, అభిమానులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



# కేటీఆర్‌కు అన్నీ స్ట్రోక్‌లే...

- కాళేశ్వరం విషయంలో బావబామ్మర్దుల ఓవరాక్షన్
- సాటు సంసారం చేసే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీది
- హరీశ్ రావు, కేటీఆర్, బండి సంజయ్ అచానక్ లీడర్లు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్




**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి రెండు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులని.. తెలంగాణ హక్కుల కోసమే సీఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్తున్నారని తెలిపారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ ది ఫాం హౌజ్ పరిపాలన, రేవంత్ రెడ్డిది ప్రజాపరిపాలన అని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల అంశాలపై ముఖ్యమంత్రులు కూర్చుని చర్చించడంలో తప్పేముందని అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలకు కళ్ళు దొబ్బినయా అంటూ మండిపడ్డారు. బావ బామ్మర్దులది పనికిమాలిన ఏడుపు అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలకు తెలంగాణ ప్రజల పట్ల బాధ్యత లేదని విమర్శించారు. 'మీరు ఫాం హౌజ్‌లో పడుకున్నారని, మమ్మల్ని కూడా ఫాం హౌజ్‌లోనే పడుకోమంటారా?' అంటూ జగ్గారెడ్డి దుయ్యబట్టారు.

**కేసీఆర్ ఎప్పుడైనా ఢిల్లీకి వెళ్ళారా?**

తెలంగాణ ప్రజల హక్కుల కోసం కేసీఆర్ ఎప్పుడైనా ఢిల్లీకి వెళ్ళారా అని ప్రశ్నించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత జై తెలంగాణ అనడం ఎందుకు అని ప్రశ్నించారు. పార్టీ నుంచి తెలంగాణ పదాన్ని తీసేసిన వాళ్లు తెలంగాణ కోసం అడిగే అర్హత ఎక్కడిదని నిలదీశారు. పార్టీ పేరులో టీ ఎందుకు తీశారు? బీ ఎందుకు పెట్టారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ పేరు నుంచి తెలంగాణ పదం తీసినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పి ముక్కు నెలకు రాయాలన్నారు. 'హరీష్ రావు ఎక్కడ పడుకుంటే మాకెందుకు? ఎవడిని గోకితే మాకేంటి? మేం తొక్కేది ఉంటే డైరెక్ట్ తొక్కుతాం. పోలీసులను అడ్డు పెట్టుకోవాల్సిన అవసరం మాకేంటి? కేటీఆర్ జోకులు వేస్తున్నాడు. రేవంత్‌కు కేసీఆర్‌కు క్రేజ్ ఉంది. కేటీఆర్, హరీష్‌ల కు క్రేజ్ ఉండడం ఏంటి? కేసీఆర్ ఉన్నన్ని రోజులే కేటీఆర్, హరీష్ రావుకు ఉనికి ఉంటుంది. అసెంబ్లీలో రేవంత్ ఉంటాడు కాబట్టే కేసీఆర్ రావడానికి భయపడుతున్నారు. అసెంబ్లీ పెట్టమని ప్రతిపక్షం డిమాండ్ చేస్తది. ప్రభుత్వం అసెంబ్లీ పెడుతామంటే ప్రతిపక్షం భయపడుతుంది. హరీష్ అంత యాక్టింగ్ మాకు రాదు. ఉత్తమ్ యాక్టర్ కాదు... ఫైటర్. కాళేశ్వరం విషయంలో కేసీఆర్, హరీష్ చేసింది మామూలు ఓవర్ యాక్షన్ కాదు. హరీష్, కేటీఆర్, బండి సంజయ్ అచానక్ లీడర్లు' అంటూ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంచలన కామెంట్స్ చేశారు.



## ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎంకు షాక్

- కుమారుడిని అరెస్టు చేసిన ఈడీ
- మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో చైతన్య అరెస్టు
- అధికారులకు సహకరించకపోవడంతో అదుపులోకి తీసుకున్న ఈడీ

**రాయ్ పూర్, మహా :** ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆయన కుమారుడు చైతన్య బఘేల్‌ను శుక్రవారం ఈ రోజు అరెస్టు చేసింది. ఉదయం బఘేల్ నివాసంలో సోదాలు నిర్వహించిన అధికారులు, అనంతరం చైతన్యను అదుపులోకి తీసుకున్నారు. మద్యం కుంభకోణంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో చైతన్య బఘేల్ పాత్ర ఉందని అభియోగాలు వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన ఈడీ, మద్యం సిండికేట్‌కు రూ. 2 వేల కోట్ల మేర లబ్ధి చేకూరిందని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతంలో బఘేల్ నివాసంలో సోదాలు నిర్వహించిన దర్యాప్తు సంస్థ శుక్రవారం మరోసారి తనిఖీలు చేపట్టింది. ఉదయం దుర్గ్ జిల్లాలోని భిలాయ్ ప్రాంతంలో గల బఘేల్ నివాసానికి ఈడీ అధికారులు చేరుకున్నారు. ఈ కేసుకు సంబంధించి కొత్త ఆధారాలు లభించడంతో మాజీ ముఖ్యమంత్రి నివాసంలో సోదాలు చేపట్టారు. చైతన్య బఘేల్ అధికారులకు సహకరించకపోవడంతో ఈడీ అధికారులు ఆయనను అరెస్టు చేశారు.

## రేవంత్ రెడ్డి శ్వేతపత్రాల సామ్రాట్

- ఢిల్లీకి వెళ్తే బొంకులు, హైదరాబాద్‌లో ఉంటే రంకులు
- ఢిల్లీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి హాట్ కామెంట్స్




**హైదరాబాద్, మహా:** సీఎం రేవంత్ రెడ్డి శ్వేతపత్రాల సామ్రాట్ అని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం అయ్యాక శ్వేతపత్రాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పరిపాలన చేస్తున్నారా ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారా అర్థంకావడం లేదన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'రాష్ట్ర ప్రయోజనాలను బలి ఇవ్వడానికి సీఎం ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రజలను మోసం, దగా చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి అడ్డంగా దొరకడం కొత్త కాదు.

**రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ దొరకడం లేదు..**

రేవంత్ రెడ్డి దాదాపు 200 రోజులు ఢిల్లీ, విదేశీ పర్యటనలకు వెళ్లారు. ఢిల్లీకి వెళ్తే బొంకులు, హైదరాబాద్‌లో ఉంటే రంకులు. హిడెన్ అజెండాతో రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ నుంచి పాలన చేస్తున్నారు. సెక్రటేరియట్ నుంచి పాలన చేయడం లేదు. కేసీఆర్ హయాంలో సాగునీటికి ఇబ్బందులు తలెత్తలేదు. ఢిల్లీకి వెళ్తే రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ దొరకడం లేదు. అప్పుపుట్టడం లేదు, దొంగను చూసినట్లు చూస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రతిష్టను దిగజారుస్తున్నారు. తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ దెబ్బ తీస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పిచ్చోడి చేతిలా మారింది. ప్రభుత్వం ఆర్డినెన్స్‌పై కన్ఫ్యూజన్‌లో ఉంది. సీఎం ఎప్పుడు ఏం మాట్లాడతారో తెలియదు. మేము బీఆర్ఎస్ స్టాండ్ ప్రకారమే బీసీ రిజర్వేషన్లపై మాట్లాడుతున్నాం' అని అన్నారు.

## ఎనిమిదేళ్ళలో 15 వేల ఎన్‌కౌంటర్లు

- 238 మంది నేరస్థుల హతం
- 30 వేల మందికి పైగా నిందితుల అరెస్టు
- యూపీ సీఎం యోగీ పాలనలో నేరస్థులపై ఉక్కుపాదం
- మీరట్ జోన్‌లో అత్యధిక ఎన్‌కౌంటర్లు : యూపీ డీజీపీ

**లక్నో, మహా :** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాలనలో రాష్ట్రంలో 15 వేల ఎన్‌కౌంటర్ కేసులు నమోదయ్యాయని ఉత్తరప్రదేశ్ పోలీసు అధికారులు తెలిపారు. యోగి ఆదిత్యనాథ్ 2017లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఇప్పటి వరకు ఈ ఎన్‌కౌంటర్లు జరిగాయని, కీలక ఆపరేషన్‌లలో 238 మంది మరణించారని డీజీపీ రాజీవ్ కృష్ణ వెల్లడించారు. దాదాపు 30 వేల మందికి పైగా నిందితులను అరెస్టు చేశామని, పోలీసులపై దాడికి ప్రయత్నించిన ఘటనల్లో 9 వేల మందికి కాలికి గాయాలయ్యాయని ఆయన పేర్కొన్నారు. పరారీలో ఉన్నవారు, తరుచూ నేరాలకు పాల్పడే వారి కోసం చేపట్టిన ఆపరేషన్‌లలో 238 మంది మరణించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నేరస్థులపై ఉక్కుపాదం మోపుతున్నామని ఆయన స్పష్టం చేశారు. గడిచిన ఎనిమిదేళ్లలో 14,973 ఆపరేషన్లు చేపట్టి 30,694 మంది నేరస్థులను అరెస్టు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో పోలీసులపై దాడులకు పాల్పడిన 9,467 మందికి కాలికి గాయాలయ్యాయని తెలిపారు. మీరట్ జోన్‌లో అత్యధిక ఎన్‌కౌంటర్లు జరిగాయని డీజీపీ తెలిపారు. ఆ తర్వాత ఆగ్రా, బరేలీ, వారణాసిలలో నేరస్థులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నేర నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆయన అన్నారు.

# యూరియా కొరత లేకుండా చూస్తాం

- త్వరలోనే వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం
- యూనిట్ పనులను పరిశీలించనున్న కేంద్ర రేల్వే మంత్రి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు త్వరలోనే ముగింపు పలకనున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రధాని పీవీ నరసింహారావు హయాం నుంచి వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ కావాలని అనేక పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్యంయూ)కి ప్రధాని మోదీ భూమి పూజ చేశారని.. యూనిట్ 60 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం యూనిట్ పనుల పురోగతిని పరిశీలిస్తారని చెప్పారు. రైలు ఇంజన్, కోచ్, వ్యాగన్స్ ఉత్పత్తి అయ్యేలా ప్లాన్ చేస్తున్నామని, ముందుగా రైలు ఇంజన్ తయారీ చేయాలని నిర్ణయించామన్నారు. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వచ్చే ఏడాది ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాదు అనుకున్న పరిశ్రమను మోదీ తెలంగాణకు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండు వందల కోట్లతో యూనిట్ పనులు ప్రారంభమయ్యాయని, మరో రెండు వందల కోట్ల వరకు బడ్జెట్ పెరిగే అవకాశం ఉందన్నారు. వరంగల్‌లో ఆధునికమైన కోచ్‌లు తయారు చేసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. సుమారు మూడు వేల మందికి ఉపాధి అవకాశం దొరుకుతుందన్నారు. ఇక్కడ నివసించే రాజస్థాన్ ప్రజలు రైలు కావాలని కోరుతున్నారని.. రేపు రాజస్థాన్‌కు ట్రైన్ ప్రారంభిస్తున్నామన్నారు. ఎంఎంటీఎస్ రెండో పేజ్ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందానికి కట్టుబడి లేదని అన్నారు. యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్‌ను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ జనవరిలో భక్తులకు అంకితం చేస్తామని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కూడా వచ్చే సంవత్సరం ప్రజలకు అంకితం చేస్తామని ప్రకటించారు. కాచిగూడ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. తెలంగాణకు మోదీ ఏమి చేశారన్న వాళ్లు వినాలి.. కళ్ళతో చూడాలన్నారు. ప్రధాని శంకుస్థాపనకు వస్తే రాకుండా ఆనాటి ముఖ్యమంత్రి ఫాం హౌస్‌లో పడుకున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణలోని అన్ని రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై సదుపాయం కల్పిస్తున్నామన్నారు..

వరంగల్‌కు మెగా టెక్స్ టైల్ పార్క్ తీసుకురావడం జరిగిందన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పాలకులు మాత్రం హైదరాబాద్ చుట్టే ఆలోచన చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. వరంగల్ విమానాశ్రయానికి భూమి సేకరించి ఇవ్వాలని కేసీఆర్‌కు అనేక లేఖలు రాసినట్లు తెలిపారు. కేసీఆర్ రాళ్లు వేయడం, విమర్శించడం తప్ప.. భూమి సేకరించి ఇవ్వలేదని విమర్శించారు.

**అప్పుడు లేఖలు రాసి... ఇప్పుడు తప్పపడతారా**

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే జోక్యం చేసుకుంది అంటున్నారని.. జోక్యం చేసుకోకపోతే.. ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారని కేంద్రమంత్రి అన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను కూర్చోపెట్టాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. జడ్జ్‌మెంట్ ఇవ్వడానికి ఇద్దరు ముఖ్యమంత్రులను పిలవలేదని స్పష్టం చేశారు. బనకచర్ల సమస్య పరిష్కారం కోసం పిలిచామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక పాలసీ.. అధికారంలో లేనప్పుడు మరొక్క పాలసీ అవలంభిస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక పాత్రలు పోషించారంటూ ఎద్దేవా చేశారు. కేంద్రానికి జోక్యం చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసిందని.. ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశాన్ని బీఆర్ఎస్ తప్పు పట్టడం ఏంటి అంటూ ప్రశ్నించారు. ఒక రాష్ట్రానికి అనుకూలంగా.. మరొక రాష్ట్రానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వరన్నారు. కృష్ణా, గోదావరి జలాలపైన ఇద్దరు ముఖ్యమంత్రులు వేరు వేరు ఎజెండాలతో వచ్చారని చెప్పారు. గోదావరి జలాల వినియోగంపైన రేవంత్ రెడ్డి ఏదైనా కార్యాచరణ రూపొందించారా అని ప్రశ్నించారు. కేంద్రాన్ని, మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలకు న్యాయం చేయాలనేదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. యూరియా కొరత లేకుండా చూసే బాధ్యత కేంద్రానిదన్నారు. బ్రిటీష్ కాలంలో ఉన్న రిజర్వేషన్లను ముస్లిం రిజర్వేషన్లు ఎట్లా అవుతాయని అడిగారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ ముస్లింల పేరు మీద పది శాతం రిజర్వేషన్ ఇచ్చిందన్నారు. పది శాతం పోతే బీసీలకు దక్కేది 32 శాతం మాత్రమే అని అన్నారు. దీనివల్ల బీసీలకు మేలు జరుగుతుందా.. అన్యాయం జరుగుతుందా ఆలోచించాలన్నారు. మతపరమైన రిజర్వేషన్లు పక్కన పెట్టి బీసీలకే ఇవ్వాలనదే బీజేపీ విధానమని స్పష్టం చేశామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు

- అభివృద్ధి పనుల కోసం గ్రాంట్లు విడుదల
- కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక నిర్ణయం



**కర్ణాటక, మహా:** కర్ణాటకలోని సిద్ధరామయ్య సర్కార్ నిర్ణయం తీసుకుంది. అభివృద్ధి పనుల నిమిత్తం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్ల గ్రాంట్ విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆమోదం తెలిపారు. పార్టీలో అంతర్గతంగా జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం ఈ మొత్తాన్ని ఇచ్చేందుకు సీఎం అంగీకరించారు. తమ నియోజవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు సరిపోవడం లేదని కర్ణాటక పార్టీ ఇంఛార్జి రణదీప్ సూర్జేవాలా వద్ద ఇటీవల ఎమ్మెల్యేలు మొరపెట్టుకున్నారు. బెంగళూరులోని పార్టీ ఆఫీస్‌లో విడివిడిగా ఒక్కో ఎమ్మెల్యే ఆయనతో మాట్లాడారు. నిధుల జాప్యంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన ప్రాజెక్టులు కుంటుపడుతున్నాయని చెప్పారు. ఈ విషయాన్ని సూర్జేవాలా సీఎం, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై అంతర్గతంగా జరిగిన చర్చ అనంతరం.. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేటాయింపుల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. దీంతో ప్రతి ఎమ్మెల్యే రూ.50 కోట్ల గ్రాంట్‌ను పొందనున్నారు.



## పదేళ్లుగా బీజేపీ మా బావను వెంటాడుతోంది

- కేసులకు తట్టుకునే ధైర్యం మా అందరికీ ఉంది
- ఎక్స్‌లో రాహుల్ గాంధీ ట్వీట్

**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం తన బావను (రాబర్ట్ వాద్రాను ఉద్దేశిస్తూ) వెంటాడుతూనే ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఓ భూ ఒప్పందానికి సంబంధించి అక్రమాలకు పాల్పడిన కేసులో రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఛార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపైనే శుక్రవారం రాహుల్ ఎక్స్ వేదికగా స్పందించారు. గత పదేళ్లుగా ఈ ప్రభుత్వం తన బావను వెంటాడుతూనే ఉందని రాహుల్ మండిపడ్డారు. ఈ తాజా ఛార్జిషీటు కూడా ఆ కోవకు చెందినదేనని విమర్శించారు. దురుద్దేశంతో, రాజకీయ కక్షతో పెట్టిన ఈ కేసును ఎదుర్కొనేందుకు రాబర్ట్ వాద్రా, ప్రియాంకల కుటుంబానికి తాను అండగా ఉంటానని రాహుల్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వీటిని తట్టుకునే ధైర్యం వారందరికీ ఉందని, నిజం ఎప్పటికైనా బయటపడుతుందని ట్వీట్ చేశారు.

## ఘనంగా జగదీశ్వర్ రెడ్డి బర్త్ డే వేడుకలు



**మిర్యాలగూడ, మహా:** రెడ్డి కాలనీ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు మిర్యాలగూడ నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహా రెడ్డి హాజరై మాట్లాడారు. జగదీష్ రెడ్డి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో చిరకాలం ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా అకాంక్షిస్తున్నామని తెలిపారు. తెలంగాణా రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర చాలా కీలకమైనదని మాజీ సీఎం కేసీఆర్ మార్గదర్శకంలో పని చేస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నీటి సమస్య పరిష్కరిస్తాం

- రెండు రాష్ట్రాలకు న్యాయం చేసేలా కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది
- తెలంగాణకు ఎట్టి పరిస్థితులలో అన్యాయం జరగదు
- రేవంత్ ప్రభుత్వం ఫోన్ ట్యాప్ చేస్తున్నట్లు అనుమానాలున్నాయి
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**జనగామ, మహా :** రెండు తెలుగు రాష్ట్రాల జలవివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనగామ వచ్చిన సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ... ఏపీ, తెలంగాణ జల వివాదం పరిష్కంచాలని ప్రయత్నిస్తే తప్పుపడుతున్నారని మండిపడ్డారు. నీటి విషయంలో రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడతామని స్పష్టం చేశారు. ఈ సమస్యను జల వివాదం కమిటీ పరిష్కరిస్తుందని చెప్పుకొచ్చారు. నీటికి సంబంధించి తెలంగాణకు అన్యాయం జరగనివ్వమని వెల్లడించారు. బీఆర్ఎస్ మళ్లీ తెలంగాణ వాదాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అప్పుడు కిషన్ రెడ్డి ఫోన్ ట్యాప్ చేశారని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్టు అనుమానం వస్తోందని ఆరోపించారు.

ఫోన్ ట్యాపింగ్‌తో కేసీఆర్ జల్సాలు చేశారని విరుచుకుపడ్డారు బండి సంజయ్. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే అంటూ వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణలో ఏ గ్రామానికైనా వస్తా. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిపై చర్చిద్దామా?'. ఇందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ సిద్ధమా?' అంటూ సవాల్ విసిరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. రెండు పార్టీల నేతలు తిట్టుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలను ప్రజలు నిలదీస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సర్పంచ్‌లు, ఎంపీటీసీలే తమ ప్రచార కర్తలని తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని.. గ్రామీణ వ్యవస్థ సర్వనాశనం అవుతోందని అన్నారు. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టైందంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి శనివారం వస్తున్నారని, వ్యాగన్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తారని తెలిపారు. అన్ని స్కామ్‌లు పక్కకు పోయాయని.. ఏ ఒక్క స్కామ్‌లోనూ కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. రెండు పార్టీలు ఒక్కటే అని.. 'నువ్వు కొట్టినట్టు చెయ్ నేను ఏడ్చినట్టు చేస్తా' అనే ధోరణిలో ఉన్నారంటూ బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు.

## హెచ్ సీఏ స్కాంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్

### స్టేడియంలోని కార్యాలయంలో సీఐడీ సోదాలు

### రెండవ రోజు కస్టడీ విచారణ పూర్తి

**హైదరాబాద్, మహా :** హెచ్‌సీఏ స్కామ్ కేసులో సీఐడీ విచారణ కొనసాగుతోంది. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో సీఐడీ సోదాలు నిర్వహించింది. హెచ్‌సీఏ అక్రమాల కేసులో నిందితుల సీన్ రీకన్‌స్ట్రక్షన్ పూర్తయింది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం ఏ 1 నిందితుడు జగన్ మోహన్ రావును ఉప్పల్ స్టేడియానికి తీసుకెళ్లారు సీఐడీ అధికారులు. ఉప్పల్ స్టేడియంలోని హెచ్‌సీఏ కార్యాలయంలో అధికారులు సోదాలు చేస్తున్నారు. అనంతరం ఉప్పల్ స్టేడియం నుంచి శ్రీచక్ర క్లబ్‌లో తనిఖీలు జరిపారు. ఈ సందర్భంగా క్లబ్ లోకి కీలక పత్రాలను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావుతోపాటు ట్రెజరర్ శ్రీనివాస్ రావు, సీఈవో సునీల్ కాంటే, శ్రీ చక్ర క్లబ్ ప్రెసిడెంట్ కవిత, క్లబ్ జనరల్ సెక్రెటరీ రాజేంద్ర యాదవ్‌లతో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. హెచ్‌సీఏ అక్రమాలపై నిందితులను సీఐడీ రెండో రోజు విచారించింది. విచారణలో భాగంగా సీఐడీ కార్యాలయం నుంచి నేరుగా ఉప్పల్ స్టేడియానికి నిందితులను తీసుకెళ్లారు. అక్కడే ఏ1 నిందితుడితో సీన్ కన్‌స్ట్రక్షన్ చేస్తున్నారు. హెచ్‌సీఏ కేంద్రంగా నడిచిన అక్రమాలన్నింటిపై సుదీర్ఘంగా దర్యాప్తు కొనసాగుతోంది. సీఐడీ విచారణలో ఫోర్జరీ డాక్యుమెంట్లతో ఎన్నిక, ఐపీఎల్ టికెట్ల వివాదం, బీసీసీఐ నుంచి వచ్చిన నిధుల గోల్‌మాల్‌పైనా దర్యాప్తు జరుగుతోంది. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేయగా జగన్ మోహన్ రావు కీలకమైన వ్యక్తి. హెచ్‌సీఏ స్కామ్‌లో జగన్ మోహన్ రావు పాత్ర కీలకమని ఇప్పటికే సీఐడీ గుర్తించింది. దాదాపు రెండు సంవత్సరాల వ్యవధిలోనే బీసీసీఐ నుంచి రూ. 170నకోట్లు నిధులు వచ్చాయి. ఈ నిధులకు సంబంధించి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అక్రమాలు జరిగాయని సీఐడీ గుర్తించింది. బీసీసీఐ నుంచి వచ్చిన నిధుల దుర్వినియోగంపై సీఐడీ ప్రత్యేక దృష్టి పెట్టింది.

## ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- మాది ప్రజల దీవెనలతో వచ్చిన ప్రజా ప్రభుత్వం
- గిరిజనులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెట్టొద్దు: పొంగులేటి
- ఇందిరా మహిళా శక్తి సంబురాలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఇంటికి దీపం ఇల్లాలు అందుకే ఆడబిడ్డలనే లబ్ధిదారులుగా చేర్చి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నది ఇందిరమ్మ ప్రభుత్వమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని బూర్గంపాడులో ఇందిరా మహిళా శక్తి సంబురాలు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంక్ లింకేజ్ రుణాలు, లోన్ బీమా, మహాలక్ష్మి బస్సుల అద్దె చెక్కులను అందజేశారు. వీటితో పాటు లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను కూడా అందజేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ చీరల మాదిరిగా కాకుండా రాబోయే రోజుల్లో మహిళా సంఘ సభ్యులకు ఒక్కొక్కరికి రెండు చీరలు అందించనున్నామని తెలిపారు.

**ఎవరెన్ని కుట్రలు పన్నినా..**

ఇది ప్రజల దీవెనలతో వచ్చిన ప్రజా ప్రభుత్వం, ప్రజల సంక్షేమం కోసమే పాటుపడుతుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. మొదటి విడతలో రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని, ఒక్క పినపాక నియోజకవర్గానికే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 300 కోట్లు కేటాయించామన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లోని 33 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. తరచుగా ముంపుకు గురయ్యే పినపాక నియోజకవర్గంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంత ప్రజలకు ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు కట్టించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పోడు భూములు సాగుచేసుకుంటున్న గిరిజన, గిరిజనేతరులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. పినపాకలో ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మాణం పూర్తయ్యేలా చూసే బాధ్యతగా మాటిస్తున్నానన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎవరెన్ని కుట్రలు పన్నినా ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

### మహిళ చనిపోతే ఆమె అప్పుల్లో

## రెండు లక్షలు మాఫీ

### మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలోని ఆడబిడ్డలందరినీ కోటీశ్వరులను చేయాలని సీఎం రేవంత్ సంకల్పంతో ఉన్నారని అన్నారు మంత్రి సీతక్క. అందులో భాగంగా మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘంలో ఉండటం వల్ల వడ్డీ లేకుండానే బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ మహిళ చనిపోతే ఆమె పేరున ఉన్న అప్పుల్లో రూ. 2 లక్షలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. మహిళా సంఘం అంటేనే వ్యాపారం చేయాలని.. మహిళా సంఘాల ద్వారా వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. 60 ఏళ్లు దాటినా కూడా మహిళా సంఘంలో చేర్పిస్తున్నామన్నారు. రూ. 300 కోట్లు వెచ్చించి మహిళలు తయారు చేసిన వస్తువులను అమ్ముకోవడం కోసం హైదరాబాద్ లో షాప్ లు తెరిపించినట్లు చెప్పారు. గోదాంలు, మిల్లులు, పెట్రోల్ బంక్ లు, కోళ్ల ఫామ్ లు ఇంకా చాలా మహిళా సంఘాలకు ఇస్తున్నామని అన్నారు. ఇందిర మహిళా శక్తి వంట.. అమ్మ చేతి వంట అని అన్నారు. ఆడవాళ్లు లేకుంటే సమాజం లేదని.. ఆడవాళ్ల లో ఉక్కు మహిళా ఇందిరమ్మ అని అన్నారు. ఒక మహిళ అయినటువంటి ఇందిరమ్మ అప్పుడే పాకిస్థాన్ ను గజ గజ వణికించిందని కొనియాడారు. పేదరికం వుండొద్దు అంటే మహిళల చేతిలో డబ్బులు ఉండాలని అన్నారు మంత్రి సీతక్క. ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు ఇవ్వడమే కాకుండా ఆ ఇంటికి మహిళను ఓనర్ ను చేస్తున్నామని అన్నారు..



# అద్భుతం చేసిన చిన్న చిత్రం..

చిన్న సినిమా అయినా, పెద్ద సినిమా అయినా.. కంటెంట్ నచ్చితేనే థియేటర్‌కు వస్తామని ప్రేక్షకులు ఘంటాపథంగా చెప్తున్నారు. కథ బాలేదంటే భారీ బడ్జెట్ మూవీ అయినా సరే మాకు అక్కర్లేదంటూ ముఖం చాటేస్తున్నారు. అలా కంగువా, థగ్ లైఫ్, ఇండియన్ 2, గేమ్ ఛేంజర్.. ఇలా ఎన్నో సినిమాలు బోల్తా కొట్టాయి.

**1200% లాభాలు**

అయితే ఓ చిన్న చిత్రం మాత్రం బాక్సాఫీస్ వద్ద మ్యాజిక్ చేసింది. ఏకంగా 1200% లాభాలను తెచ్చిపెట్టింది. ఆ మూవీయే టూరిస్ట్ ఫ్యామిలీ. ఈ ఏడాది ఇప్పటివరకు అత్యధిక లాభాలు గడించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. కేవలం రూ.7 కోట్లతో నిర్మించిన ఈ తమిళ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.90 కోట్లు వసూలు చేసి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

**ఐదు వారాల్లోనే..**

టూరిస్ట్ ఫ్యామిలీ మూవీలో శశికుమార్, సిమ్రాన్, మిథున్ జై శంకర్, కమలేశ్ జగన్ ప్రధాన పాత్రల్లో నటించారు. అభిషన్ జీవింత్ దర్శకత్వం వహించాడు. ఏప్రిల్ 29న విడుదలైన ఈ చిత్రం విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు అందుకుంది. మొదటివారం కేవలం రూ.23 కోట్లు మాత్రమే రాగా.. మౌత్ టాక్ వల్ల రెండో వారం రూ.29 కోట్లు వచ్చాయి. ఐదు వారాలు తిరిగేసరికి ఏకంగా రూ.90 కోట్లు వసూలు చేసింది.

**ఛావాను వెనక్కు నెట్టి**


ఈ ఏడాది అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రాల్లో విక్కీ కౌశల్ 'ఛావా' ముందు వరుసలో ఉంది. రూ.90 కోట్లతో రూపొందిన ఈ మూవీ 800 % లాభాలతో రూ.800 కోట్లకుపైగా వసూళ్లు సొంతం చేసుకుంది. అయితే పర్సంటేజీ లెక్కన చూస్తే.. టూరిస్ట్ ఫ్యామిలీ ఛావాను వెనక్కు నెట్టి 1200% లాభాలను గడించి నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. టూరిస్ట్ ఫ్యామిలీ ప్రస్తుతం హాట్‌స్టార్‌లో అందుబాటులో ఉండగా.. ఛావా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోంది.

# భయంగా ఉంది... అయినా సిద్ధమే

## : సల్మాన్ ఖాన్

గాల్వాన్ లోయలో 2020లో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన యుద్ధం, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంతో రూపొందుతున్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్'. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్నారు. ఇందులో ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారు సల్మాన్. అలాగే ఈ చిత్రంలోని మరో కీలక పాత్రలో నటి చిత్రాంగద సింగ్ కనిపిస్తారు. ఈ సినిమాకు సంబంధించి తన ప్రిపరేషన్ గురించి సల్మాన్ ఖాన్ తాజాగా మాట్లాడుతూ– ''నా గత చిత్రం 'సికందర్' యాక్షన్ మూవీ. 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' డిఫరెంట్ మూవీ. ఇందులో చాలా యాక్షన్ అయితే ఉంది. కానీ గత చిత్రాలతో పోల్చినప్పుడు ఈ చిత్రం పూర్తిగా విభిన్నమైంది. ఈ సినిమా కోసం చాలా శ్రమిస్తున్నాను. ప్రతి రోజూ వర్కౌట్స్ చేస్తున్నాను. ఈ తరహా కష్టాన్ని ఈ సినిమా డిమాండ్ చేస్తుంది. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించనున్నాం. కష్టమైన లొకేషన్స్‌లో షూట్ చేయాల్సి ఉంది. లడక్‌లో దాదాపు ఇరవై రోజుల షూటింగ్ ప్లాన్ చేశాం. ఇందులో ఎనిమిది రోజులు గడ్డకట్టే చలిలో షూటింగ్ చేయాల్సి ఉంది. ఈ విషయం తలచుకుంటే నాకు భయంగా ఉంది. కానీ ఇందులో నేనే నటించడానికి సిద్ధంగా ఉన్నాను. ఫిజికల్ గా ఈ సినిమా కష్టమైనప్పటికీ ఈ జర్నీ నాకో మంచి మెమొరీ'' అని పేర్కొన్నారు.

ఇక అపూర్వ లఖియా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది. అనుకున్న ప్రకారం ఈ సినిమా షూటింగ్ పూర్తయితే వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదల చేసే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. ఒకవేళ కుదరకపోతే... సల్మాన్ ఖాన్ ఫేవరెట్ సీజన్ రంజాన్ సందర్భంగా ఈ సినిమా విడుదల కావొచ్చు.






# దక్షిణాది సినీ అవార్డుల సంబురం.. తేదీ, వేదిక ఫిక్స్!

దక్షిణాదిలో ప్రతిష్టాత్మక సినీ పండుగ తేదీలు ఖరారు చేశారు. సౌత్ ఇండస్ట్రీలో అందించే ప్రముఖ సైమా అవార్డుల వేడుక జరిగే వేదికను కూడా నిర్ణయించారు. ఈ ఏడాది జరగనున్న 13వ ఎడిషన్ అవార్డుల వేడుకను దుబాయ్‌లోనే నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 5,6 తేదీల్లో ఈ గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. దక్షిణాది సినిమాల్లో ప్రతిభ కనబరిచిన నటీనటులకు ఈ ప్రతిష్టాత్మక అవార్డులు అందజేయనున్నారు. ఇప్పటివరకు సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ పేరిట 12 ఎడిషన్లు పూర్తి చేసుకుంది. దీనికి సంబంధించిన నామినేషన్స్ జాబితాను త్వరలోనే విడుదల చేయనున్నారు. గత రెండేళ్లుగా ఈ వేడుకను దుబాయ్‌లోనే నిర్వహిస్తున్నారు. ఈసారి అక్కడే సినీ అవార్డుల వేడుక సైమా జరగనుంది.

# అందరూ సర్‌ప్రైజ్ అవుతారు!

'యానిమల్' సినిమాతో దేశవ్యాప్తంగా యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది త్రిప్తి దిమ్రి. . ప్రభాస్-సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' చిత్రం నుంచి దీపికా పదుకోన్ తప్పుకోవడంతో ఆమె స్థానంలో త్రిప్తి దిమ్రిని నాయికగా ఎంపిక చేశారు. తాజా ఇంటర్వ్యూలో ఈ భామ తాను నటిస్తున్న సినిమాల విశేషాలను వెల్లడించింది. ''స్పిరిట్' సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. బలమైన భావోద్వేగాలు కలబోసిన కథ ఇది. ఈ సినిమాలోని ఎలిమెంట్స్ అందరిని సర్‌ప్రైజ్ చేస్తాయి. నా కెరీర్‌లో మరో ఉత్తమ చిత్రంగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. అదొక అద్భుతమైన కథ. కెరీర్ ఆరంభంలోనే ప్రతిభావంతులైన దర్శకులతో పనిచేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా' అని చెప్పింది.

# అసలు నేనెలా ప్రేమిస్తా.. రూమర్స్‌పై క్లారిటీ

యంగ్ హీరోయిన్ శ్రీలీల ప్రస్తుతం పలు భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉంది. తాజాగా 'జూనియర్'లో వైరల్ వయ్యారిగా తెగ సందడి చేస్తోంది. సరే ఈ సంగతులు పక్కనబెడితే బాలీవుడ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో ఈమె ప్రేమలో ఉందనే రూమర్స్ గత కొన్నాళ్లుగా గట్టిగా వినిపిస్తున్నాయి. వీళ్లిద్దరూ కలిసి పనిచేస్తుండటమే ఇందుకు కారణం. తాజాగా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ శ్రీలీల ఈ పుకార్లతో పాటు తన పెళ్లి గురించి ఓ క్లారిటీ ఇచ్చేసింది. 'నేను లవ్ చేస్తున్నానని అంతా అనుకుంటున్నారు. కానీ నేనెలా ప్రేమలో పడగలను. ప్రతిసారి అమ్మ నాతో ఉంటోంది. అయినాసరే నాపై రూమర్స్ వస్తూనే ఉన్నాయి. లేకలేక మియామీ వెళ్లినప్పుడు కూడా నా వెంట అమ్మ వచ్చింది. అలాంటప్పుడు నేనెలా ప్రేమలో పడతాను చెప్పండి' అని శ్రీలీల క్యూట్‌గా క్లారిటీ ఇచ్చింది. కొన్నిరోజుల క్రితం పెళ్లి కూతురిలా రెడీ వాటిని శ్రీలీల సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీంతో అంతా ఈమెకు పెళ్లి అని ఫిక్సయ్యారు. కానీ అది తన పుట్టినరోజు, అలా బుట్టలో తీసుకెళ్లడం తన కుటుంబ సంప్రదాయం అని చెప్పింది. దీంతో కాస్త రిలాక్స్ అయ్యారు. ఇక పెళ్లి విషయమై స్పందించిన శ్రీలీల.. తనకు ఇప్పుడు 23 ఏళ్లు అని, ఎలా లేదన్నా 30 ఏళ్లు వచ్చేవరకు తను అసలు పెళ్లి చేసుకోనని కూడా చెప్పుకొచ్చింది. మరి అప్పుడైనా ప్రేమ వివాహమా? లేదంటే పెద్దల కుదిర్చిన పెళ్లా అనేది చూడాలి?





EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034